www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 30 డిసెంబర్ 2024

5

తూర్పుగోదావరి



నిడదవోలు-నర్సాపురం రైలు నడపాలి

ప్రజాశక్తి-చాగల్లు

చాగల్లు మండలం నుంచి దూరప్రాంతాలు వెళ్లేందుకు ముఖ్యంగా నరసాపురం వైపు వెళ్లేందుకు రైలు వేయాలని ప్రజలు కోరుతున్నారు. ఆర్‌టిసి బస్సులు, కార్లు, బైకులపై వెళ్లాలంటే రోడ్లు గోతుల మయం కావడంతో ప్రయాణానికి చాలా ఇబ్బందిగా ఉంటోందని తెలిపారు. 2019 కోవిడ్ ముందు నిడదవోలు నర్సాపురం ట్రైన్స్ యథావిధిగా నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు. నరసాపురం వెళ్లేందుకు, నిడదవోలు వచ్చేందుకు ఉదయం పూట తప్ప మధ్యాహ్నం సాయంత్రం ప్రయాణం చేయడం చాలా ఇబ్బందిగా ఉంటుందని వాపోయారు. కనుక రైల్వే అధికారులు తమ కష్టాలను పరిగణనలోనికి తీసుకుని గతంలో వలే నిడదవోలు-నర్సాపురం, నర్సాపురం-నిడదవోలు రైళ్లు వేయాలని ప్రజలు కోరుతున్నారు.

సమరోత్సాహంతో ముందుకు...

- ముగిసిన సిపిఎం జిల్లా మహాసభ
- ఉత్తేజ పరిచిన నాయకులు ప్రసంగాలు
- జిల్లా కార్యదర్శిగా అరుణ్ ఎన్నిక
- కార్యదర్శి వర్గ సభ్యులుగా రాంబాబు, తులసి, పవన్



మహాసభలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ మిడియం బాబూరావు, సిపిఎం పతాకాన్ని ఆవిష్కరిస్తున్న సీనియర్ నాయకులు టిఎస్.ప్రకాష్

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

రెండు రోజుల పాటు రాజమహేంద్రవరం జరిగిన సిపిఎం జిల్లా మహాసభ ఆ పార్టీ శ్రేణుల్లో సమరోత్సాహాన్ని నింపింది. నాయకులు ప్రసంగాలు ఉత్తేజ పరిచాయి. పలు ప్రజా సమస్యలపై మహాసభ చర్చించి కార్యాచరణకు దిశానిర్దేశం చేసింది. ప్రజాపోరాటాలతో ముందుకు సాగేందుకు నూతన కార్యవర్గం సిద్ధమైంది.

నగరంలోని రౌతు తాతాలు కళ్యాణ మండపంలో ఆదివారం రెండో రోజు సిపిఎం జిల్లా మహాసభ జరిగింది. తొలుత ఆ పార్టీ సీనియర్ నాయకులు కెఎస్.ప్రకాష్ సిపిఎం పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రజానాట్యమండలి కళాకారు లు ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి.

అనంతరం జువ్వల రాంబాబు, బి.పవన్, పి.తులసి అధ్యక్ష వర్గంగా ప్రతినిధుల సభ జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం మాట్లాడారు. కవులు, కళాకారులకు పుట్టినిల్లైన రాజమహేంద్రవరం అభ్యుదయ, సాంఘిక ఉద్యమాలకు వేదిక అన్నారు. గత వారసత్వాన్ని కొనసాగించేందుకు సిపిఎం శ్రేణులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఉభయ గోదావరి జిల్లాల సారూప్యతను వివరించారు. స్వాంతంత్ర్య పోరాటంలోనూ ఈ ప్రాంత ప్రత్యేకతను గుర్తు చేశారు. కమ్యూనిస్టులు నిర్వహించిన పోరాటాలు, విజయాలను ప్రస్తావించారు. కేంద్రంలో బిజెపి హయాంలో ఎన్‌డిఎ సర్కారు ప్రజా వ్యతిరేక చర్యలకు పాల్పడుతుందన్నారు. ప్రజాస్వామ్యానికి, లౌకికతత్వానికి, రాజ్యాంగానికి తూట్లు పొడుస్తుందన్నారు. అవే విధానాలను కూటమి ప్రభుత్వమూ అనుసరిస్తోందన్నారు. చాతుర్వర్ణ వంటి ప్రమాదకర సంస్కృతిని ఎంపీ పురంధేశ్వరి, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ స్వాగతిస్తారా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో వైసిపికి ప్రతిపక్ష అర్హత లేదన్నారు. గత వైఫల్యాలను ఆత్మవిమర్శ కూడా చేసుకోలేని స్థితిలో ఆ పార్టీ ఉందన్నారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాల్సిన గురుతర బాధ్యత కమ్యునిస్టులపైనే ఉందన్నారు. దేశంలోనూ, రాష్ట్రంలోనూ ప్రజలకు అండగా ప్రతిపక్ష పాత్ర పోషించాలన్నారు. ఆ దిశగా రాబోయే రోజుల్లో జరిగే పోరాటాలకు నాయకత్వం వహించాలన్నారు.

భద్రాచలం మాజీ ఎంపీ మిడియం బాబూరావు మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో కుల, వర్గ, మత వంటి సామాజిక విభజన ఉన్నప్పటికీ కమ్యూనిస్టులను అందరూ స్వాగతిస్తారన్నారు. ఆదర్శవంతమైన వ్యక్తిగత, విప్లవ జీవన విధానమే దీనికి కారణమన్నారు. కమ్యునిస్టు ఉద్యమ నిర్మాత సుందరయ్య వారసత్వాన్ని కొనసాగించాలన్నారు. కేంద్రంలోని బిజెపి సర్కారు అదానీ, అంబానీలకు దేశ సహజ వనరులను కారుచౌకగా దోచి పెడుతుందన్నారు. అటువంటి లూటీని ఎండగడుతూ ప్రజలకు వివరించాలని సూచించారు. ప్రస్తుతం పాలకులు ప్రజలను మభ్యపెట్టి రాజకీయాలు చేస్తున్నారని ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించిన విజన్-2047 దీనిలో భాగమేనన్నారు. రాబోయే రోజులలో సుశక్తి కల్గిన సైనికులను తయారు చేసేందుకు ఈ మహాసభ నాంది పలకాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఎం.సుందరబాబు, కెఎసివి.రామచంద్రరావు, వై.బేబిరాణి, పి.తులసి, బి.పవన్, ఎన్.రాజా, సీనియర్ నాయకులు ఎస్ఎస్.మూర్తి, పోలిన వెంకటేశ్వరరావు, టిఎస్.ప్రకాష్, ఐద్వా నాయకులు జరీనా, వెంకటలక్ష్మి, సిపిఎం నగర కార్యదర్శి కె.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


టి.అరుణ్, జిల్లా కార్యదర్శి

సిపిఎం జిల్లా కార్యదర్శిగా అరుణ్

తూర్పుగోదావరి జిల్లా మహాసభలో భాగంగా నూతన జిల్లా కమిటీ ఎన్నిక జరిగింది. మొత్తం 12 మందితో నూతన కమిటీ ఎన్నికైంది. జిల్లా కార్యదర్శిగా టి.అరుణ్ మరోసారి ఎన్నికయ్యారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులుగా జువ్వల రాంబాబు, బి.పవన్, తులసి ఎన్నికయ్యారు. జిల్లా కమిటీ సభ్యులుగా ఎం.సుందరబాబు, కెఎస్‌వి.రామచంద్రరావు, ఎన్.రాజా, క్రరి రామకృష్ణ, బివిఎన్.పూర్ణిమ రాజు, వై.బేబిరాణి, అరుణ, ఐ.సుబ్రహ్మణ్యం ఎన్నికయ్యారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు


జువ్వల రాంబాబు


బి.పవన్


పి.తులసి


ఎడ్ల పోటీలను తిలకిస్తున్న ప్రజలు


ఉత్సాహంగా సాగుతున్న ఎడ్ల పరుగు పోటీలు

జోరుగా ఎడ్ల పరుగు పోటీలు

ప్రజాశక్తి-రాజానగరం

సంస్కృతీ సాంప్రదాయాలకు ప్రతీకగా రంగంపేట మండలం వడిశలేరులో ఎడ్లబండ్ల పోటీలు ఆదివారం ఉత్సాహంగా సాగాయి. ఒకదానికొకటి పోటీపడిగా ఎడ్లు రంకెలు వేస్తూ పరుగు తీశాయి. గన్ని సత్యనారాయణ స్మారక 6వ వార్షిక పోటీల్లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి సీనియర్ విభాగంలో 18 జతల ఎడ్లు, జూనియర్ విభాగంలో 45 జతల ఎడ్లు పాల్గొన్నాయి. రాష్ట్ర శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు, పర్యాటక సాంస్కృతిక ఫోటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్, ఎంఎల్ఎలు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బత్తుల బలరామకృష్ణ, ఆదిరెడ్డి శ్రీనివాసు, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, మాజీ ఎంఎల్ఎ జక్కంపూడి రాజా ముఖ్య అతిథులుగా పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. సీనియర్లు ఎడ్లబళ్ల పరుగులో 1600 మీటర్ల దూరం వెళ్ళి రావాలి. దీనిలో మొదటి స్థానం 6 నిమిషాల 40 సెకెన్ల 35 పాయింట్లతో అంబేద్కర్ కోనసీమ జిల్లా గుమ్మిలేరుకు చెందిన కోరా శృతి చౌదరి ఎడ్లు నిలిచాయి. ద్వితీయ స్థానంలో అనకాపల్లి జిల్లా కెజి.పురం రైతు ఆంజనేయం ఎడ్లజత 6 నిమిషాల 51 సెకెన్ల 28 పాయింట్లతో నిలిచాయి. తృతీయ స్థానంలో అంబేద్కర్ కోనసీమ జిల్లా గుమ్మిలేరుకు చెందిన కోరా శృతి చౌదరి ఎడ్ల జత 6 నిమిషాల 51 సెకెన్ల 47 పాయింట్లు వచ్చాయి. జూనియర్ల విభాగంలో ఎడ్లబళ్ల పరుగు 1000 మీటర్ల దూరం వెళ్ళి రావాలి. దీనిలో ప్రథమ స్థానంలో 4 నిమిషాల 16 సెకెన్ల 19 పాయింట్లతో కోనసీమ జిల్లా మండపేటకు చెందిన కోరా వేగుళ్ళ కృష్ణమాధవి ఎడ్లు, ద్వితీయ స్థానంలో అంబేద్కర్ కోనసీమ జిల్లా గుమ్మిలేరుకు చెందిన రైతు కోరా శృతి చౌదరి ఎడ్లజత 4 నిమిషాల 20 సెకెన్ల 94 వచ్చాయి. ద్వితీయ స్థానంలో నెల్లూరు జిల్లా గంగపట్నంకు చెందిన చాముండేశ్వరి సీఫుడ్స్ ఎడ్ల జత 4 నిమిషాల 21 సెకెన్ల 32 పాయింట్లతో వచ్చాయి. విజేతలకు నగదు, మోటారు సైకిల్ బహుమతులుగా అందజేశారు. దీనికి న్యాయనిర్ణేతలుగా కృష్ణా జిల్లాకు చెందిన సూరపనేని రాధాకృష్ణ ప్రసాద్, కాకినాడకు చెందిన చేకూరి రామకృష్ణ వ్యవహరించారు. ముఖ్య అతిథిలను విజేతలను ఎడ్ల బళ్ల పోటీల నిర్వాహకులు డాక్టర్ గన్ని భాస్కరరావు సన్మానించి జ్ఞాపికలు అందజేశారు.


సభలో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు


పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి కందుల దుర్గేష్


శ్రీనివాసును సన్మానిస్తున్న సర్పంచులు

డిసి చైర్మన్ శ్రీనివాస్‌కు సర్పంచుల ఘన సత్కారం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

పెరవలి డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ బి.శ్రీనివాస్‌ను మండలంలోని పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో చివటం ఎంపిటిసి వివి.సత్యనారాయణ, వేలివెన్ను, కె.సావరం, తాడిపర్రు సర్పంచ్‌లు అత్తిలి సత్యనారాయణ, నార్ని రామకృష్ణ, కె.నరేంద్రబాబు, సూర్యారావుపాలెం ఎన్.శ్రీనివాస్, ఎం.శ్రీనివాస్ తపాల్గొన్నారు.

వక్తృత్వ పోటీల్లో సంజన ప్రతిభ

ప్రజాశక్తి-కడియం

రాజమహేంద్రవరంలో ఆదివారం నిర్వహించిన వక్తత్వ పోటీల్లో కడియపులంకకు చెందిన చిన్నారి మార్గాని సంజన ప్రథమ స్థానం సాధించింది. ఇంధన పొదుపు అంశంపై సంజన చేసిన ప్రసంగం అందరినీ ఆలోచింపజేసింది. సంజన ప్రముఖ నర్సరీ రైతు, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మార్గాని సత్యనారాయణ మనవరాలు. రాజమహేంద్రవరం ట్రిప్స్ స్కూల్లో తొమ్మిదో తరగతి చదువుతోంది. చిన్నతనం నుంచి చలాకీగా ఉండే సంజన చదువుతోపాటు వక్తత్వ, వ్యాసరచన, చిత్రలేఖనం వంటి విభాగాల్లో అనేక బహుమతులు అందుకుంది.

ఆదరణ, ఆదాయం లేదు.. ఆదుకోరూ..

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

కుల వృత్తి అయిన కమ్మర పని చేసుకుంటూ, జీవనం కొనసాగిస్తున్న తమకు ప్రభుత్వం తరపున రుణాలు మంజూరు చేసి ఆదుకోవాలని చేతి వృత్తి పనివారు వేడుకుంటున్నారు. తణుకు పరిసర ప్రాంతమైన వీరభద్రపురం నివాసులైన కంద్రాతి శ్రీను, ఓరుగంటి నాని, కంద్రాతి సంతోష్ తదితర కుటుంబాల వారు మండలంలో పాటు నాలుగైదు జిల్లాలల్లోని గ్రామాలలో రోజుకు సుమారు 10 నుండి 12 గంటలు పని చేస్తామన్నారు. ఇన్ని గంటలు పని చేస్తున్నప్పటికీ సరైనన ఆదాయం లేకపోవడంతో బతుకు భారంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ తాతల కాలంలో అధిక శాతం వ్యవసాయంపై ఆధారపడి రైతులు, వివిధ పనిముట్లు తయారు చేయించుకునే వారని, దీంతో ఆదాయం ఉండి, కుటుంబ పోషణ సజావుగా జరిగేదన్నారు. తాతల కాలం నుండి చదువులు పక్కనపెట్టి, తమ కుటుంబాలు ఇదే వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నట్టు తెలిపారు. ఇటీవల కాలంలో వ్యవసాయదారులు తగ్గిపోవడం, వ్యవసాయ పనిముట్లకు గిరాకీ లేకపోవడం వల్ల ఆదాయం గణనీయంగా పడిపోయిందన్నారు. గత 30, 40 ఏళ్లలో తమ కుటుంబంలోని ఒక వ్యక్తి మాత్రం చదువుకుని, ప్రభుత్వ టీచర్ ఉద్యోగం సాధించినట్లు తెలిపారు. అసలే కులవృత్తులకు పని తగ్గడం, దీనికి తోడు ఇటీవల రాజస్థాన్ నుంచి అనేకమంది ఈ ప్రాంతంలో పని చేస్తుండడంతో తమకు పోటీ కూడా ఎక్కువగా ఉందంటున్నారు. ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు ఉన్నప్పటికీ ప్రభుత్వం తరపున తమకు ఎటువంటి నివాస గృహాలు కేటాయించక పోవడం బాధాకరమన్నారు. తమకు వేరే పని చేతకాదని, ఊరూరా తిరిగి పని చేసుకోవడం, సొంతిల్లు లేకపోవడం వంటి వాటి వల్ల ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకం ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన సైతం తమకు అందడం లేదని చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వం తమ వృత్తికి సంబంధించిన రుణాలు మంజూరు చేసి, ఆదుకోవాలని వేడుకుంటున్నారు.


కత్తులు తయారు చేస్తున్న చేతి వృత్తి పనివారు

నలుగురికి మానవత ఆధ్వర్యాన ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఉండ్రాజవరం శాఖ ఆధ్వర్యంలో కఠారి సిద్ధార్థ రాజు అధ్యక్షతన నెలవారీ మండల సమావేశం ఆదివారం పాలంగి కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండలంలోని మోర్త గ్రామానికి చెందిన ఐసెట్టి ఏసుదాసు, కర్రి రమణ, నెమ్మళ్ల లీలావతి, తాళం నాగమణి అనారోగ్యం పాలైనందున వారికి వైద్య ఖర్చుల నిమిత్తం ఒక్కొక్కరికీ రూ.ఐదు వేల చొప్పున మొత్తం రూ.20 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి ఫణితిని పార్వతి, తాతిన కృష్ణారావు, వెలిచేటి బోసు, సుంకవల్లి కోటేశ్వరరావు, రామకృష్ణ, ప్రసాద్ బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



బాధితులకు చెక్కు అందిస్తున్న మానవత సంస్థ సభ్యులు


సరి చేసిన మ్యాన్‌హోల్

కడియంలో మ్యాన్ హోల్ ఏర్పాటు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-కడియం

ఈ నెల 12న ప్రజాశక్తి దినపత్రికలో 'ప్రమాదభరితంగా మ్యాన్ హోల్' శీర్షికన వచ్చిన వార్తకు అధికారులు స్పందించారు. కడియం గ్రామం గిరజాల వారి వీధిలో రోడ్డు మధ్యలో ఉన్న మ్యాన్‌హోల్ బల్లలు పూర్తిగా పాడై నిత్యం రాకపోకలు కొనసాగించే ప్రజలకు ఇబ్బందిగా మారింది. దీర్ఘకాలంగా ఉన్న సమస్యపై అధికారులు, శాశ్వత మరమ్మతులు చేపట్టడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నేడు పెరవలి మండల సమావేశం

ప్రజాశక్తి-పెరవలి

మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపిఇ కె.సీతారామ్‌ప్రసాద్ అధ్యక్షతన నిర్వహిస్తామని ఇన్‌ఛార్జి ఎంపిడిఒ సిహెచ్.వెంకటరమణ తెలిపారు. ఈ సమావేశానికి అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు, నాయకులు విధిగా హాజరవ్వాలని పిలుపునిచ్చారు.

ముమ్మరంగా దాళ్వా వరి ఊడ్పులు

ప్రజాశక్తి-చాగల్లు

మండలంలో ముమ్మరంగా దాళ్వా వరి సాగు చేపట్టారు. 7500 ఎకరాలకుగాను ఇప్పటి వరకూ 2300 ఎకరాల్లో వరి నాటినట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి కె.గోపాలకృష్ణ తెలిపారు. మండలంలో వరి నారుమళ్లలో ఎంపియు 1121, పిఆర్ 126 వరి రకాలను సాగు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

పద్మశాలి ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

పద్మశాలి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని ఆదివారం రాజమండ్రి రూరల్ ఎంఎల్‌ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ పద్మశాలి ఉద్యోగులందరూ ఐక్యంగా ప్రజా సేవా కార్యక్రమాల్లో పాల్గొని తమ వంతు సహాయ సహకారాలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యర్రమోతు ధర్మరాజు, తంగెళ్ల హరికిషోర్, తీడ ఆదిబాబు, నీలం సత్యనారాయణ, నిచ్చనగుంట గోపీకృష్ణ, సిద్ధనాతి శ్రీనివాస్, మీసాల వీర్రాఘవులు, నీలం సన్యాసిరావు, నామన వెంకట రమణ, నీలి కిషోర్ పాల్గొన్నారు.

న్యూ ఇయర్ వేడుకల్లో అల్లర్లు సృష్టిస్తే చర్యలు

ప్రజాశక్తి-చాగల్లు

డిసెంబరు 31 రాత్రి నూతన సంవత్సరం వేడుకల్లో అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ కె.నరేంద్ర అన్నారు. నూతన సంవత్సర వేడుకలపై జిల్లా ఎస్‌పి మార్గదర్శకాలు జారీ చేశారన్నారు. మరికొన్ని రోజుల్లో నూతన సంవత్సరం వస్తున్న నేపథ్యంలో, మండలంలో డిసెంబరు 31న హోటళ్లు, వైన్ షాపుల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన సమయం వరకే అనుమతి ఉంటుందని స్పష్టం చేశారు. ప్రత్యేక ఈవెంట్లు నిర్వహించాలంటే ముందుగా దరఖాస్తు చేసుకోని అనుమతి తీసుకోవాలన్నారు. ఈవెంట్ల నిర్వహణ స్థలాల్లో సిసి కెమేరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈవెంట్లలో అశ్లీలత ఉండరాదని, నిర్ణీత స్థాయికి మించి శబ్దస్థాయి దాటరాదని పేర్కొన్నారు. ఈవెంట్లలో మత్తు పానీయాలు, డ్రగ్స్ వంటివి వాడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

కబడ్డీ జిల్లా జట్టుకు ఎంపికలు పూర్తి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం


50వ అంతర్ జిల్లాల కబడ్డీ, బాలురు బాలికల చాంపియన్‌షిప్‌లో భాగంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కబడ్డీ బాలబాలికల సెలక్షన్స్ ఆదివారం ఆర్ట్స్ కాలేజీ గ్రౌండ్‌లో నిర్వహించినట్లు కబడ్డీ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎవిడి ప్రసాదరావు తెలిపారు. ఎంపికైన తూర్పు గోదావరి జిల్లా టీమ్ జనవరి 3, 4 తేదీల్లో కర్నూలు జిల్లాలో జరిగే అంతర్ జిల్లాల కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని ప్రసాదరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివేకానంద స్పోర్ట్స్ క్లబ్ సెక్రెటరీ, క్లబ్ ఫౌండర్ మండల సూర్యనారాయణ, జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి యశ్వంత్, పీడీలు, పిఇటిల అసోసియేషన్ సెక్రెటరీ ఎస్ నాగరాజు, రాజమండ్రి జోన్ ప్రెసిడెంట్ ఉమాదేవి, సెక్రెటరీ డి.విజయ విక్టర్, డి.శ్రీనుబాబు, ఆర్ఎస్ ప్రసాద్, సుంకయ్య, సునీత, వెంకటేశ్వరరావు, పివివి లక్ష్మి సెలెక్షన్స్ నిర్వహించారు. క్లబ్ ఫౌండర్ సెక్రెటరీ మండల సూర్యనారాయణను ఆర్గనైజింగ్ కమిటీ ఘనంగా సన్మానించింది. సివిల్ సర్వీసెస్ గేమ్‌కు ఎపి కబడ్డీ టీముకు ఎంపికైన కానవరం పీడీ శ్రీనుబాబును సత్కరించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఆర్‌డిఎస్ఎస్ పనులలో భాగంగా వ్యవసాయ బోర్లకు ప్రత్యేక 11 కెవి.ఫీడర్ వేయు పనుల నిమిత్తం సోమవారం ఉదయం 8:00 గంటల నుంచి మధ్యాహ్నం 2:00 గంటల వరకూ విద్యుత్ సరఫరా తాత్కాలికంగా నిలిపివేస్తామని ఎపిఇపిడిసిఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్.నారాయణ అప్పారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మోర్త సబ్ స్టేషన్ పరిధిలో 11 కెవి.వేలివెన్ను ఫీడర్, చిలకపాడు ఫీడర్లలో వ్యవసాయ వినియోగదారులకు, మోర్త గ్రామానికి, విద్యుత్ సరఫరా తాత్కాలికంగా నిలిపివేస్తామని ఆయన తెలిపారు.

కార్టూ'నిజం'



బిసి హాస్టల్ వద్ద తుప్పలు, చెత్తకుప్పలు

ప్రజాశక్తి-గోపాలపుర

స్థానిక పెద్దగూడెంలోని బిసి సంక్షేమ బాలురు వసతి గృహం వద్ద ఉన్న దట్టమైన మొక్కలను, చెత్తా చెదారాలను తొలగించాలని స్థానికులు కోరారు. స్థానిక గోపాలపురం పెద్దగూడెం నివాసాలను ఆనుకుని బిసి సంక్షేమ బాలుర వసతి గృహం ఉంది. హాస్టల్‌ను ఆనుకొని చుట్టూ దట్టమైన పొదలతో మొక్కలు, చెత్త చదారాలతో అధ్వానంగా ఉంది. సంబంధిత హాస్టల్ అధికారులు గానీ, పంచాయతీ అధికారులు గానీ, కన్నెత్తి చూసిన దాఖలాలు లేవని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హాస్టల్ వసతి గృహంలో సుమారు 25 మంది విద్యార్థులు ఉంటున్నారు. చుట్టూ దట్టమైన పొదలతో చిట్టడవులను తలపిస్తున్నాయి. దట్టమైన మొక్కలు ఉండడంతో దోమలు, విషసర్పాలు సంచరిస్తున్నాయని తెలిపారు. హాస్టల్‌లోని విద్యార్థులకు, గ్రామస్తులకు దోమలతో కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయని వాపోయారు. దీంతో వ్యాధుల బారిన పడుతున్నామని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛభారత్ అంటూ అనేక కార్యక్రమాలు, ప్రకటనలు చేపట్టినప్పటికీ అవి క్షేత్రస్థాయిలో గ్రామస్థాయిలో అమలు నోచుకోవడం లేదని తెలిపారు. ఉప్పరగూడెం, పెద్దగూడెం ఎస్‌సి ఏరియాలలో ఎప్పటికప్పుడు చెత్త కుప్పలు తెప్పలుగా పేరుకుపోతున్నాయి. పంచాయతీ చెత్త సేకరణ వాహనం నెలకు ఒకసారి మాత్రమే వచ్చి చెత్తను సేకరించడంతో ఎస్‌సి పేటలలో ఎక్కడ చూసిన చెత్త కుప్పలు పేరుకుపోతున్నాయని తెలిపారు. పలుచోట్ల రోడ్లపైనే చెత్త వేస్తున్నట్లు పలువురు తెలిపారు. దీంతో ప్రజలు అవస్థలు పడుతున్నట్లు తెలిపారు. దీనికి తోడు హాస్టల్ కాంపౌండ్ వాల్‌లో చెద పుట్టలు వెలిశాయని, వాటిలో విష సర్పాలు చేరితాయని తెలిపారు. విద్యార్థులకు ప్రమాదం పొంచి ఉందని వెంటనే వాటిని తొలగించాలని స్థానికులు కోరారు. బిసి హాస్టల్ చుట్టూ ఉన్న అడవులను తలపిస్తున్న పొదలను తొలగించాలని, చెత్త కుప్పలను తొలగించాలని గ్రామస్తులు విద్యార్థులు కోరారు.


బిసి హాస్టల్‌ను ఆనుకుని ఉన్న చెత్త కుప్పలు, పొదలు

నేరాలు ఘోరాలు

పోక్సో కేసులో నిందితుని అరెస్ట్

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

ధవళేశ్వరంలో బాలిక అదృశ్యం కేసులో పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి నిందితుని అరెస్టు చేశారు. బాలిక ఆచూకీ కనుక్కుని అందుకు కారణమైన ధవళేశ్వరంలోని వాడపేటకు చెందిన పేర్ల జాన్‌ను అరెస్ట్ చేసినట్లు సిఐ టి.గణేష్ తెలిపారు.

ప్రమాదాల్లో గాయపడిన ఇద్దరు మృతి

ప్రజాశక్తి - యంత్రాంగం

వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన ఇద్దరు వ్యక్తులు చికిత్స పొందుతూ ఆదివారం మరణించారు. వివరాలు ఇవి..

ముమ్మిడివరం మోటార్ సైకిల్ పై వెళుతున్న వ్యక్తిని ట్రక్ ఆటో ఢీ కొట్టడంతో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం వ్యక్తి మరణించారు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ముమ్మిడివరం మండలం మాగాం చెందిన నక్కా సోమశేఖర్ (32) ఆదివారం ఉదయం మోటార్ సైకిల్‌పై అమలాపురం వెళుతున్నారు. అనాతవరం వాటర్ ప్లాంట్ వద్ద వెనక నుండి ట్రక్ ఆటో ఢీ కొట్టడంతో సోమశేఖర్ తీవ్రంగా గాయపడ్డారు. అతనిని అమలాపురం ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమశేఖర్ మరణించారు. మృతునికి భార్య అశ్విని ఉన్నారు. ఈ మేరకు ఎస్ఐ డి.జ్వాలా సాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆత్రేయపురం: రోడ్డు ప్రమాదంలో గాయాల పాలైన యువకుడు చికిత్స పొందుతూ రాజమహేంద్రవరం ఒక ప్రయివేటు ఆస్పత్రిలో ఆదివారం మరణించాడు. పోలీసులు వివరాలు ప్రకారం మెర్లపాలెం గ్రామానికి చెందిన షణ్ముఖ వీర వెంకటేశ్వరరావు(18) మండలంలోని పులిదిండి ఇసుక ర్యాంపు లో సూపర్ వైజర్ గా పని చేస్తున్నాడు. ఎప్పటిలాగే తన పనులు ముగించుకుని ఈ నెల 28న సాయంత్రం పులిదిండి నుండి తన స్నేహితుడు సత్యనారాయణతో కలిసి మోటార్ సైకిల్ పై ముమ్మిడివరం వెళుతున్నాడు. ఈ సమయంలో లొల్ల గ్రామ సమీపంలో ఆర్అండ్‌బి రోడ్డుపై వీరి మోటార్‌సైకిల్‌ను ట్రాక్టరు ఢీకొంది. ఈ ఘటనలో మోటార్‌సైకిల్‌పై వెళుతున్న ఇద్దరికీ గాయాలయ్యాయి. వీరిని రాజ మహేంద్రవరం కిమ్స్ ఆస్పత్రి చికిత్స నిమిత్తం తరలించారు. షణ్ముఖ వీర వెంకటరావుకు కు పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఆసుపత్రి నుండి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు.

గంజాయి విక్రయిస్తున్న యువకుని అరెస్ట్

ప్రజాశక్తి - రాజోలు

గంజాయి విక్రయిస్తున్న ఓ యువకుడిని రాజోలు పోలీసులు అరెస్టుచేసి ఈనెల 28న రిమాండ్‌కు తరలించారు. ఆదివారం రాజోలు ఎస్ఐ బి.రాజేష్ కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాజోలు మండలం నున్నవారిబాడవ ఇసుక ర్యాంప్ సమీపంలో గంజాయితో బొండాడ ప్రదీప్ అలియాస్ చిన్నను పట్టుకున్నట్లు తెలిపారు. అతని వద్ద నుంచి 545 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. నిందితుడిని రాజోలు కోర్టుకు తరలించగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గంజాయికి అలవాటు పడితే జీవితాలు నాశనమవుతాయని, దీనిపై స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నామని, పట్టుబడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కోడిపందేలపై పోలీసుల దాడి ఐదుగురు అరెస్టు

ప్రజాశక్తి - సీతానగరం

నల్లగొండ గ్రామ శివారులో ఆదివారం కోడిపందేలు ఆడుతున్నట్లు సమాచారం అందటంతో సీతానగరం ఎస్ఐ రామ్ కుమార్ ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. గ్రామ శివారు మామిడి తోటలో కోడిపందేలు ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరొక్కరు పరారీలో ఉన్నారు. సంఘటనా స్థలంలో రూ.6700 నగదు, మూడు కోడి పుంజులు, రెండు కత్తులు, 8 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు. నిందితులను కోర్టులో హాజరు పరుస్తామని ఎస్ఐ తెలిపారు.

సారా బట్టీలపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - రౌతులపూడి

ఏలేరు కాలవ సమీపంలో సారా బట్టీలు నిర్వహిస్తున్నారని వచ్చిన సమాచారంతో ఆదివారం ఆయా బట్టీలపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో 50 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, సారా బట్టీ నిర్వహిస్తున్న బత్తిన ఆనందను అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు అతనిపై కేసు నమోదు చేసినట్లు ఆయన వెల్లడించారు.

4న జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన

ప్రజాశక్తి - అమలాపురం

పి.గన్నవరం మండలంలోని పి.గన్నవరం గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు వచ్చే నెల 4న జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి షేక్ సలీం బాషా ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమ నిర్వహణ పట్ల పూర్తి వివరాల కొరకు జిల్లా సైన్స్ అధికారి జిఐస్. సుబ్రహ్మణ్యం సెల్ నెం. 96401 88525 నందు సంప్రదించవచ్చున్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలి

ప్రజాశక్తి - ఆలమూరు

రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్ ఉన్న రూ. 3580 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని విద్యార్థి యువజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని కొత్తూరు సెంటర్ వద్ద ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకట్ ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకట్, మాట్లాడారు. డిసెంబర్ 30న విజయవాడ నగరంలో ధర్నా చౌక్ నందు జరిగే పోరు దీక్షకు విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

70 ఏళ్లు దాటితే ఉచిత ఆరోగ్య బీమా

ప్రజాశక్తితో డిఎం అండ్ హెచ్ఒ నరసింహనాయక్



ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

కేంద్ర ప్రభుత్వ సహకారంతో 70 సంవత్సరాలు పైబడిన వారందరికీ ఉచిత ఆరోగ్య బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు కాకినాడ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి జె.నరసింహ నాయక్ తెలిపారు. ఆయుష్మాన్ భారత్ పథకంలో ఆరోగ్య బీమా కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఆయుష్మాన్ భవ పథకాన్ని ఈ ఏడాది సెప్టెంబర్లో ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందన్నారు. ఆదాయ పరిమితితో సంబంధం లేకుండా 70 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరికీ ఈ పథకం వర్తిస్తుందన్నారు. జిల్లాలోని సుమారు 90 వేల మంది 70 ఏళ్ల పైబడిన వద్ధులు ఉన్నారన్నారు. దేశంలోని 6 కోట్ల మంది సీనియర్ సిటిజన్లతో సహా 4.5 కోట్ల కుటుంబాలకు ఈ పథకం ద్వారా ప్రయోజనం చేకూరనుందన్నారు. ఈ పథకం కింద ఒక్కో కుటుంబానికి రూ.ఐదు లక్షల బీమా వర్తిస్తుందని చెప్పారు. దీని కోసం సీనియర్ సిటిజన్లందరికీ ప్రత్యేకంగా కార్డులు జారీ చేస్తారన్నారు. ఈ పథకం కింద ఎవరెవరు ప్రయోజనం పొందవచ్చు? ప్రయివేట్ ఆరోగ్య బీమా ఉన్నవారికీ ఇది వర్తిస్తుందా? లాంటి విషయాలను 'ప్రజాశక్తి' ముఖాముఖిలో ఆయన వివరించారు.

ఉచిత బీమా ఎలా అమలవుతుంది.?

పిఎంజెఎవై పథకాన్ని 2018లో ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రారంభించారు. పేద కుటుంబాలకు ఈ పథకం కింద ఆరోగ్య సేవలు అందుతున్నాయి. 70 ఏళ్ల పైబడి, ఆర్థిక పరిస్థితులకు సంబంధం లేకుండా రూ.5 లక్షల ఆరోగ్య బీమా అందుబాటులోకి తెచ్చింది. అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరడానికి మూడు రోజుల ముందు వరకు అయ్యే వైద్య పరమైన ఖర్చులకు సైతం నగదు రహిత కవరేజీ ఉంటుంది. చికిత్స సమయంలో మందులు ఉచితంగా అందిస్తారు. గుండె సంబంధ వ్యాధులకు అమర్చే స్టంట్లు, ఐసియు, జనరల్ వార్డుల్లో ఉండి పొందే చికిత్సకు బీమా వర్తిస్తుంది. రోగికి చికిత్స సమయంలో భోజనం ఉచితంగా అందిస్తారు. ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయిన తర్వాత 15 రోజుల పాటు చికిత్సకు అయ్యే ఖర్చులకు చెల్లింపులు అందుతాయి. ఈ పథకం కింద ఇప్పటికే వైద్యారోగ్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరించి ఆయుష్మాన్ కార్డులు జారీ చేశారు.

ఉచిత ఆరోగ్య బీమా ఎలా పొందాలి.?

ప్రస్తుతం 70 ఏళ్లు నిండిన వృద్ధులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.పిఎంజెఎవై.ఇన్ వెబ్‌సైట్లో దరఖాస్తు చేసుకుని ఆయుష్మాన్ కార్డు పొందవచ్చు. అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలి. ఇప్పటికే పేదలందరికీ ఈ పథకం కింద రూ.5 లక్షల వరకు లబ్ధి చేకూరుతోంది. ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరించి కార్డులు జారీ చేశాం. తాజాగా ఆర్థిక, ఆదాయ పరిస్థితులకు సంబంధం లేకుండా 70 ఏళ్లు నిండిన వృద్ధులకు ఈ పథకం వర్తింప జేస్తున్నారు. వీరికి కూడా రూ.5 లక్షల ఆరోగ్య బీమా వర్తిస్తుంది. ప్రయివేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం



చేసుకునే వెసులుబాటును కేంద్ర కల్పించింది.

ప్రయోజనం ఎవరికి, ఎంత ?

ఆదాయంతో సంబంధం లేకుండా ఈ బీమా సౌకర్యాన్ని పొందవచ్చు. అందుకోసం సీనియర్ సిటిజన్లకు ప్రత్యేకంగా కార్డులు జారీ చేస్తారు. గతంలో ఉమ్మడి కుటుంబాలు ఉండేవి. ఇప్పుడు చిన్న కుటుంబాలు అయిపోయాయి. అందువల్ల, వృద్ధుల సామాజిక భద్రత, ఆరోగ్య సంరక్షణకు ఇది అవసరం. ఒక కుటుంబంలో ఒకరి కంటే ఎక్కువ మంది వృద్ధులు ఉంటే, వారికీ బీమా పంపిణీ అవుతుంది. అలాగే, ఆయుష్మాన్ భారత్ పథకంలో లేని 70 ఏళ్లు పైబడిన వారు కూడా ఈ పథకంలో చేరవచ్చు.

ఎవరు అర్హులు కారు?

కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకాలైన (సిజిహెచ్ఎస్), ఎక్స్-సర్వీస్‌మెన్ కాంట్రిబ్యూటరీ మెడికల్ స్కీమ్ (ఇసిహెచ్ఎస్), సాయుధ దళాల ఆయుష్మాన్ పథకం (సిఎపిఎఫ్) వంటి బీమా పథకాలకు అర్హులైన 70 ఏళ్లు దాటిన వారందరూ ప్రస్తుతం వర్తిస్తున్న స్కీమ్‌లోనే కొనసాగవచ్చు. లేదా ఈ కొత్త పథకంలో చేరొచ్చు. అయితే, వీటిలో ఏదో ఒక పథకం కింద మాత్రమే ప్రయోజనం పొందే అవకాశం ఉంటుంది.

మృతుల కుటుంబాలకు పలువురి పరామర్శ



ఆలమూరులో మునీశ్వరమ్మ చిత్రపటం వద్ద ఎంఎల్ఎ బండారు సత్యానందరావు, నాయకుల నివాళి

ప్రజాశక్తి - యంత్రాంగం

ఇటీవల మరణించిన మృతుల కుటుంబాలను ఆదివారం ప్రజాప్రతినిధు, నాయకులు పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ఆలమూరు: గత ప్రభుత్వ హయాంలో ఆలమూరు ప్రభుత్వ ఆసుపత్రి అభివద్ధి కమిటీ చైర్మన్ గా పనిచేసి పేదలకు విశేష సేవలు అందించిన చల్లా మునీశ్వరమ్మ (80) మతి బాధాకరమని, అటువంటివారు అరుదుగా ఉంటారని కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అన్నారు. మండల కేంద్రంలోని పసుపులేటి వారి వీధిలో ఉన్న ఆమె నివాసానికి ఆదివారం స్థానిక కూటమి నాయకులతో కలిసి ఎంఎల్ఎ బండారు వెళ్లారు. ఈ సందర్భంగా మునీశ్వరమ్మ చిత్రపటానికి ఎంఎల్ఎ సత్యానందరావు, నాయకులు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అలాగే ఆమె కుటుంబ సభ్యులు ప్రభాకరరావు, నానాజీ, భూషణం తదితరులను ఎంఎల్ఎ పరామర్శించారు. ఆయన వెంట మాజీ జడ్‌పిటిసి సభ్యులు రామానుజుల శేషగిరిరావు, మాజీ సొసైటీ అధ్యక్షులు వంటిపల్లి సతీష్ కుమార్, రాష్ట్ర టిడిపి లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి కప్పల సునీల్ కుమార్, కూటమి నేతలు చీపురుపల్లి గణేష్, ఈదల రాంబాబు, కంఠంశెట్టి శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు. **మండపేట:** పట్టణం, మండపేట మండలంలో ఇటీవల మరణించిన పలువురి కుటుంబ సభ్యులను ఆదివారం రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు పరామర్శించారు. ఇటీవల మరణించిన 6వ వార్డులో బట్టా రామలింగం, 13వ వార్డులో శీలం అప్పారావు, తాపేశ్వరం గ్రామంలో పుట్టా వెంకట్రావు, ద్వారపూడి గ్రామంలో సత్తింశెట్టి సాగర్, కోమలి పుల్లయ్య కుటుంబ సభ్యులను ఎంఎల్ఎ పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియ జేశారు. ఈ పరామర్శలలో ఎంఎల్ఎ వెంట మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవర ప్రకాష్, మున్సిపల్ వైస్ చైర్మన్ పిల్లి గణేష్, 6వ వార్డు కౌన్సిలర్ కాశిన కాశీ విశ్వనాథం పాల్గొన్నారు.



పరామర్శిస్తున్న మండపేట ఎంఎల్ఎ వేగుళ్ల

భూపతిపాలెం పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి-గోకవరం

భూపతిపాలెం గురుకుల పాఠశాలలో 1984 నుంచి ఇప్పటివరకు 40 బ్యాచుల విద్యార్థులు మహాసమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. ఇక్కడే చదువుకుని ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడిన ఇంజనీర్లు, డాక్టర్లు, ఉపాధ్యాయులు తమ స్నేహితులతో సరదాగా గడిపారు. ఈ మహా సమ్మేళనానికి పూర్వ విద్యార్థులతో పాటు జిల్లా ఎస్‌పి డి.నరసింహంకిషోర్, స్థానిక ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ ముఖ్య అతిథులుగా పాల్గొని వారి అనుభవాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ గురుకుల పాఠశాలలో చదివిన విద్యార్థులకు ఒక ప్రత్యేకత ఉంటుందన్నారు. చదువులోనూ క్రీడల్లోనూ ప్రతిభ కనబరుస్తారనానరు. గురుకుల పాఠశాల విద్యార్థులు పోటీలో దిగారు అంటే పతకాలు పట్టికెళ్లడం ఖాయమని ఎదుటివారికి అర్థం అయిపోతుందన్నారు. ఇలా క్రీడల్లో ప్రతిభ కనబరిచిన వారికి ఉద్యోగాలు సాధించడం సులభం అవుతుంది. తాను కూడా ఒకప్పుడు శ్రీకాకుళం ఎస్.ఎం.పురం గురుకుల పాఠశాలలో చదువుకున్నానని తెలిపారు. ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ తన నియోజకవర్గంలో ఇంత గొప్ప పాఠశాల ఉండడం చాలా సంతోషకరమన్నారు.



సమ్మేళనంలో మాట్లాడుతూ ఎంఎల్ఎ నెహ్రూ

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-రాజోలు

మండలంలోని బి.సావరంలోని శోభనా ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ లో 1999-2000 సంవత్సరం పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. ఇక్కడ విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు వివిధ స్థాయిలో ఉన్నవారు అందరూ హాజరయ్యారు. పూర్వ విద్యార్థులు నాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. పాఠశాల ప్రిన్సిపాల్ జోసఫ్ ఆధ్వర్యంలో పూర్వపు విద్యార్థులు నాటి ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాన్ని ప్రారంభించారు. పూర్వ విద్యార్థులు తమకు విద్యను బోధించిన నాటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ క్రమం తప్పకుండా ప్రతి సంవత్సరం పూర్వ విద్యార్థులు కలుసుకొని తమకు విద్యను బోధించిన ఉపాధ్యాయులకు సన్మానించడంతో పాటు పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. 2000 తమ పూర్వపు విద్యార్థులను కలుసుకునే విధంగా కషి చేసిన వారందరికి అప్పటి ప్రిన్సిపల్ జోమి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పూర్వ విద్యార్థులు,ఉఫాధ్యాయులు పాల్గొన్నారు.



పాల్గొన్న 1999-2000 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు, ఉపాధ్యాయులు

జొన్నాడ- మండపేట రోడ్డు పరిశీలన

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని జొన్నాడ సెంటర్ నుంచి మండపేట వెళ్లే రోడ్డు మరమ్మతు పనులను రాష్ట్ర ఆర్అండ్‌బి చీఫ్ ఇంజినీర్ నయీముల్లా ఆదివారం పరిశీలించారు. రాష్ట్రవ్యాప్తంగా ఆర్అండ్‌బి రోడ్ల మరమ్మతులు జరుగుతున్న నేపథ్యంలో వాటిని పరిశీలించడానికి జిల్లాకు చీఫ్ ఇంజినీర్ నయీముల్లా విచ్చేశారు. ఈసందర్భంగా ఆయన ఆలమూరు వద్ద రోడ్డును పరిశీలించి నాణ్యతను అడిగి తెలుసుకున్నారు. జొన్నాడ మండపేట రోడ్డు మరమ్మతు పనులు సంతృప్తికరంగా ఉన్నాయని ఆయన అన్నారు. ఈయన వెంట ఆర్అండ్‌బి ఎస్ఇ కాంతు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాము, డిప్యూటీ ఇంజినీర్ సూర్యనారాయణ, ఎఇ వెంకటరమణ, తదితరులు ఉన్నారు. **మండపేట:** జిల్లా మండపేట నుంచి జొన్నాడ వరకు అధ్వానంగా ఉన్న ఆర్అండ్‌బి రోడ్డుకు రూ.1కోటి 30 లక్షలతో మరమ్మతులు చేపట్టారు. గత కొన్నేళ్లుగా రహదారి పెద్దపెద్ద గోతులు పడి రాకపోకలకు తీవ్ర అంతరాయంగా మారింది. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డుపై రాకపోకలకు ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రోడ్డు మరమ్మతులకు నిధులు మంజూరు చేయడం తో పనులు చేపట్టారు. మొత్తం రోడ్డు పనులు పూర్తికావడంతో రోడ్డుపై ప్రస్తుతం ప్రయా ణిస్తున్న వాహన దారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పట్టణంలో వైద్య విజ్ఞాన అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - రామచంద్రపురం

పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర స్కానింగ్ సెంటర్లో ఆదివారం రామచంద్రపురం డివిజన్ ఆర్ఎంపి వైద్యులకు వైద్య విజ్ఞాన అవగాహరా సదస్సు నిర్వహించారు. డాక్టర్ ఆనంద్ భాస్కర్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ సమావేశంలో వైద్యులకు వివిధ వ్యాధులు, వాటికి నిర్వహించాల్సిన పరీక్షలపై అవగాహన కల్పించారు. డివిజన్ అధ్యక్షులు డాక్టర్ ఎన్వి కృష్ణారావు, కార్యదర్శి సిహెచ్ దేవానంద్ ప్రసంగించారు. గ్రామీణ వైద్యులు మరింత నైపుణ్యంగా వైద్య సేవలు అందించాలని ప్రజలకు మరింత చౌకగా వైద్యం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆర్ఎంపి ప్రధాన కార్యదర్శి గునిపే శోభన్ బాబు, ఫెడరేషన్ ఉపాధ్యక్షులు కెవివి.సత్య నారాయణ, కోశాధికారి చినబాబు, డాక్టర్ పివి. సత్యనారాయణ, డివిజన్లోని ఆర్ఎంపిలు పాల్గొన్నారు.

ఎడ్ల పరుగులో 'గుమ్మిలేరు' హ్యాట్రిక్

ప్రజాశక్తి - ఆలమూరు



వీరభద్రరావుతో ప్రజాప్రతినిధులు

తూర్పుగోదావరి జిల్లా రంగంపేట మండలం వడిశిలేరులో జరిగిన రాష్ట్రస్థాయి ఎడ్ల పరుగులో మండలంలోని గుమ్మిలేరుకు చెందిన కోరా వీరభద్రరావు ఎడ్ల జతలు పలు విభాగాల్లో బహుమతులు సాధించాయి. వడిశిలేరులో ఆదివారం గన్ని సత్యనారాయణ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి ఎడ్ల పరుగులో గుమ్మిలేరు రైతు కోరా వీరభద్రరావుకు చెందిన ఎడ్లు హ్యాట్రిక్ విజయాలు సాధించాయి. వీరభద్రరావుకు చెందిన ఎడ్ల జతలు సీనియర్స్ విభాగంలో ప్రథమ స్థానం, తృతీయ స్థానాలు సాధించాయి. ప్రథమ బహుమతిగా బుల్లెట్ 350సిసి, తృతీయ బహుమతిగా హోండా షైన్ బహు మతులుగా నిర్వాహకులు అందించారు. అలాగే జూనియర్స్ విభాగంలో ద్వితీయ స్థానం సాధించారు. బహుమతులను గన్ని సత్యనారాయణ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్, ఎంఎల్ఎలు గోరంట్ల బుచ్చి చౌదరి, రఘురామ కృష్ణంరాజు, బత్తుల బలరామకృష్ణ, ఆదిరెడ్డి వాసు, మాజీ ఎంఎల్ఎ జక్కంపూడి రాజా, మాజీ ఎంపీ మార్గాని భరత్, రుడా మాజీ ఛైర్మన్ మేడపాటి షర్మిల రెడ్డి, గన్ని కృష్ణ తదితరులు బహుమతులను అందజేశారు. రాష్ట్ర స్థాయి ఎడ్ల పరుగు పోటీల్లో విజయం సాధించిన కోరా వీరభద్రరావును పలువురు అభినందించారు.

నీటి సంఘం అధ్యక్షుడు శివప్రసాద్‌కు అభినందన

ఆలమూరు : మడికి నీటి సంఘం అధ్యక్షుడిగా మండలంలోని మడికి శివారు మల్లవానితోటకు చెందిన చెల్లబోయిన వెంకట శివప్రసాద్ ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం ఆయనను నివాసం వద్ద మండల బిసి సంఘ సభ్యులుకలిసి అభినందించి ఘనంగా సత్కరించారు. అలాగే రైతులకు నిత్యం అందుబాటులో ఉంటూ సాగునీరు అందించేందుకు తగు చర్యలు చేపట్టి పూర్తి చేయాలని వారు కోరారు. ఈ సందర్భంగా రైతులకు ఉత్తమ సేవలు అందిస్తానని అధ్యక్షుడు శివప్రసాద్ అన్నారు. అభినందించిన వారిలో మండల టిడిపి బీసీ సెల్ అధ్యక్షుడు చెల్లబోయిన సింహాచలం, బిసి సంఘం సభ్యులు చెల్లబోయిన వెంకటరమణ, మామిడిశెట్టి వెంకట రమణారావు తదితరులు ఉన్నారు.

ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షునిగా యర్రంశెట్టి

ముమ్మిడివరం : ముమ్మిడివరం చాంబర్ ఆఫ్ కామర్స్ నూతన అధ్యక్షునిగా యర్రంశెట్టి వెంకటేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నగర పంచాయతీ పరిధిలో స్థానిక వాసవి కళ్యాణ మండపంలో ఆదివారం ముమ్మిడివరం వర్తక సంఘ సమావేశం నలమాటి కొండలరావు అధ్యక్షతన నిర్వహించారు. తొలుత వర్తకుల సమస్యలపై చర్చించారు. అనంతరం నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. అధ్యక్షునిగా యర్రంశెట్టి వెంకటేశ్వర రావు, గౌరవ అధ్యక్షునిగా పసుమర్తి వెంకట సుబ్బారావు, ఉపాధ్యక్షునిగా నలమాటి కొండలరావు, సెక్రటరీగా కంచర్ల నగేష్, ట్రెజరర్‌గా అప్పన్న తాతాజీ, జాయింట్ సెక్రటరీగా వెత్సనాగు, కార్యవర్గ సభ్యులుగా చోడపనీడి బాలకృష్ణ, కొప్పిశెట్టి చంద్రశేఖర్, వీళ్ళ చలపతి, సుంకర గంగ, పుత్తూరు నాగరాజు, యర్రంశెట్టి శ్రీను, రాయపరెడ్డి వెంకటస్వామి, వెత్సా సుబ్బారావు, కోన శ్రీహరి రెడ్డి తదితరులను సమావేశం ఎన్నుకుంది.

కరాటేలో సిద్ధార్థ విద్యార్థుల ప్రతిభ

ఆలమూరు : ఇటీవల కాకినాడలో జరిగిన జాతీయస్థాయి కరాటే తైక్వాండో మార్షల్ ఆర్ట్స్ పోటీలలో ఆలమూరు, రావులపాలెంలలో ఉన్న శ్రీసిద్ధార్థ హైస్కూల్, రావులపాలెం సెయింట్ పాట్రిక్ స్కూల్ విద్యార్థులు కటాస్, ఫైటింగ్ విభాగాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచారు. దీంతో మండలంలోని కలవచర్లకు చెందిన మార్షల్ ఆర్ట్స్ గ్రాండ్ మాస్టర్ టి.అబ్బులు ఆధ్వర్యంలో ఆదివారం కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావును వాడపాలెంలో ఆయన నివాసంలో విజేతలతో వెళ్లి కలిశారు. ఎంఎల్ఎ బండారు విజేతలను అభినందించారు. కార్యక్రమంలో కూటమి నేతలు కంఠం శెట్టి శ్రీనివాస్, బండారు రాజేష్, చిలువురి సతీష్ రాజు, కముజు శ్రీనివాసు, కొమ్ము నారాయుడు, సవరపు శ్రీనివాస్, మార్షల్ ఆర్ట్స్ కోచస్ టి.వెంకటలక్ష్మి, టి.ఎల్.సందీప్ కిరణ్ తదితరులు ఉన్నారు.

మంత్రి సుభాష్‌తో చర్చకు సిద్ధం : ఎంపీ బోస్

రామచంద్రపురం : మంత్రి సుభాష్‌తో చర్చకు సిద్ధమని ఎంపీ బోస్ అన్నారు. మాజీ మంత్రి వేణు అవినీతిపై ఎంపీలు సుభాష్ చంద్రబోస్ మాట్లాడకపోవడంపై కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తీవ్ర ఆరోపణలు చేశారు. భీమేశ్వరాలయం, జగన్ కాలనీ ల్యాండ్ ఫిల్లింగ్, వంటి పలు అక్రమాలకు పాల్పడినా బోస్ విమర్శించలేదని, దీనికి కారణం ఏంటని ప్రశ్నించారు. దీనిపై డిబేట్ కు రావాలని సవాలు విసిరారు. ఈ నేపథ్యంలో ఎంపీ బోసు ఆయన తనయుడు పిల్లి సూర్య ప్రకాష్ ఆదివారం సమావేశమయ్యారు. మంత్రితో డిబేట్‌కు తాను సిద్ధమేనని స్పషం చేశారు. వేదిక ఎక్కడైనా పర్వాలేదన్నారు. వెంకటయ్యపాలెం సర్పంచ్‌పై లేనిపోని ఆరోపణలు చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. వెంకటాయపాలెం సర్పంచ్ ఎల్లమిల్లి సతీష్‌కుమారి మాట్లాడుతూ తాను అవినీతికి పాల్పడ్డానని నిరూపిస్తే వెంటనే రాజీనామా చేస్తానన్నారు. నిరూపించ లేకపోతే మంత్రి ఏం చేస్తారో ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నానన్నారు. ఎన్నికల ముందు తన ఇంటికి వచ్చి విజయానికి సహకరించాలని ఎందుకు అభ్యర్థించారని మంత్రిని ప్రశ్నించారు. స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద తాను కూర్చుంటానని తన వెనక ఎంతమంది ఉన్నారు. ఎంపిటిసి వెనక ఎంతమంది ఉన్నారో చూడాలన్నారు. సూర్యప్రకాష్ మాట్లాడుతూ అర్థం లేని ఆరోపణలు చేయడం మానుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపిపి అంబటి భవాని, వాసంశెట్టి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ రవితేజను సత్కరిస్తున్న మాల మహానాడు నాయకులు

డాక్టర్ కారెం రవితేజకు సన్మానం

ప్రజాశక్తి - అయినవిల్లి

కోనసీమ కేర్ ఆసుపత్రి అధినేత డాక్టర్ కారెం రవితేజకు మండల మాలమహానాడు ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఇటీవల డాక్టర్ రవితేజకు బెస్ట్ ఎక్స్‌లెన్స్ డాక్టర్' "అవార్డు వచ్చింది. ఈ సందర్భంగా స్థానిక వాసవి కన్యకా పరమేశ్వరి ఫంక్షన్ హాల్లో మండల మహానాడు ఆధ్వర్యంలో డాక్టర్ రవితేజను గజమాలతో, దుశ్శాలువాలతో సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి "మిషన్ ఛైర్మన్ కారెం శివాజీ, మాలమహానాడు అధ్యక్షుడు గిడ్ల వెంకటేశ్వరరావు, బి.రామచంద్రరావు, కొంకణి వెంకట రావు, జడ్‌పిటిసి సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు, న్యాయవాదులు బడుగు భాస్కర్ జోగేష్ తదితరులు పాల్గొన్నారు.



ఈదరపల్లి సమావేశంలో మాట్లాడుతున్న పిఎస్ఎన్ మూర్తి

ఐక్యతను దెబ్బతీసే విధంగా వర్గీకరణ

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

ఎస్‌సి వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు తీర్పు కులాల ఐక్యతను దెబ్బతీసే విధంగా ఉందని, దీనివలన ఎటువంటి సామాజిక అంతరాలు తొలగిపోవని పిఎస్ఎన్ మూర్తి అన్నారు. ఎపి ఎస్‌సి వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా ఆధ్వర్యంలో ఎస్‌సి వర్గీకరణ కు సంబంధించి సుప్రీంకోర్టు తీర్పుపై ఆయన వివరణ ఇచ్చారు. ఆదివారం ఈదరపల్లి అంబేద్కర్ కమ్యూనిటీ భవనంలో జరిగిన సమావేశంలో మూర్తి పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత రిజర్వేషన్లు విధానానికి విఘాతం కలిగించే సుప్రీంకోర్టు తీర్పును ఆధారంగా చేసుకుని రాష్ట్ర ప్రభుత్వాలు వర్గీకరణ విధానాన్ని ముందుకు తీసుకెళ్లే ఆలోచన మానుకోవాలని ప్రభుత్వాలకి విజ్ఞప్తి చేశారు. సమావేశానికి 300 మంది పైబడి ఉద్యోగులు, న్యాయవాదులు, సామాజికవేత్తలు హాజరయ్యారు. కార్యక్రమంలో ఎపి ఎస్‌సి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బత్తుల నకుల రాజు, గోసంగి బంగార్రాజు, ప్రబుద్ధ భారత్ పరస్పర సహకార సంఘం అధ్యక్షులు పెనుమాల చిట్టిబాబు, ఉపా ధ్యక్షులు మల్లేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

ప్రజాశక్తి - అయినవిల్లి

మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అయినవిల్లి విఘ్నేశ్వర స్వామిని ఆదివారం రాజమహేంద్రవరానికి చెందిన పరిమి వెంకట నాగరత్నం కుటుంబ సభ్యులు దర్శించికుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి నిత్యాన్నదాన నిధికి రూ.10,116 విరాళంగా ఇచ్చినట్లు ఆలయ ఇఒ సత్యనారాయణ రాజు తెలిపారు వీరికి ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం అందజేసి, శేష వస్త్రాలతో సత్కరించి, స్వామి వారి చిత్రపటాన్ని బహూకరించారు.